ప్రజాశక్తి
బుధవారం 17 ఏప్రిల్ 2024   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పెరిగిన దాహం కేకలు

- నీరు లేక అల్లాడుతున్న జనం
- తాగునీటి తీవ్రత పెరిగినా చలనం లేని యంత్రాంగం
- చిలకలూరిపేటలో తీవ్రంగా సమస్య
- గ్రామాల్లో రోడ్డెక్కుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాలో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాలుస్తోంది. ఆరునెలలుగా సరైన వర్షాల్లేక చెరువులు, కాల్వలు ఎండిపోతున్నాయి. తాగునీటికి గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు కూడా నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో పోషకులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒక

వైపు పచ్చగడ్డి దొరక్క, కాల్వల్లో నీరు లేక ఎండ తీవ్రతతో పశువులను బయటకు తీసుకువెళ్లడానికి పశు పోషకులు చాలావరకు వెనకంజవేస్తున్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడిపై ప్రజలు రోడెక్కుతున్నారు. ప్రత్తిపాడులో తాగునీటి కోసం వైసిపి పార్టీ ఆధ్వర్యంలోనే సోమవారం రాస్తారోకో జరిగింది. స్థానిక చెరువుకు నీరు రాలేదని అధికార పార్టీ కార్యకర్తలే రోడ్డుకి ఆందోళన చేశారు. నాదెండ్ల మండలం తర్లుపాడు మేజర్‌కు సాగర్ జలాలు రావడం లేదని రెండురోజుల క్రితం నాదెండ్ల వాసులు నరసరావుపేటలో ధర్నా చేశారు. నాదెండ్ల, అప్పాపురం, ఎండుగంపాలెం, గణపవరం, కనపర్తి, సాతులూరు చెరువులు పూర్తిగా ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వలు ఆధునీకరణ చేయకపోవడం వల్ల తూటుకాడ, గుర్రపుడెక్క పెరిగిపోయి సాగర్ జలాలు ఇంతవరకు పెదనందిపాడు మండలానికి పూర్తిగా చేరలేదని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఐదేళ్లుగా తాగునీటి వనరులను అభివృద్ధి చేయకపోవడం వల్ల జలజీవన్ మిషన్ పనులు పూర్తికాకపోవడంతో పెదనందిపాడు మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మండలం పరిధిలోని 17 గ్రామాలకు గాను రెండు మూడు గ్రామాలు మినహా మిగతా అన్ని గ్రామాల్లో ▶ 2లో

రేపటి నుండి నామినేషన్ల స్వీకరణ

- ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు
- ఆన్‌లైన్‌లోనూ దాఖలుకు అవకాశం
- అభ్యర్థులకు 13 రకాల ధ్రువపత్రాలుండాలి
- నామినేషన్లు సమర్పించిన నాటి నుండి అభ్యర్థి ఖర్చుల గణన
- పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం నుండి నామినేషన్లను స్వీకరించనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తామని, అదే రోజు నుండి నామినేషన్లను స్వీకరణ ఉంటుందన్నారు. 25 నామినేషన్ల దాఖలకు చివరి తేదీఅని, వాటి పరిశీలన 26న ఉంటుందని, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ 29అని, వచ్చేనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటాయని వివరించారు. నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను అభ్యర్థులు తీసుకురావాలని, అవన్నీ సరిగా ఉంటేనే నామినేషన్లను స్వీకరిస్తారని చెప్పారు. చివరి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని 3 గంటల తర్వాత ఒక్క సెకను దాటినా నామినేషన్ తీసుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఎవరి ▶ 2లో

పోలీసులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, పక్కన ఎస్పీ తదితరులు

నామినేషన్లప్పుడు వివాదాలకు ఆస్కారమివ్వొద్దు : ఐజి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు విధులు నిర్వహించాలని గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి కోరారు. ఎన్నికలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి తప్పనిసరిగా తెలుసుకుని అమలు చేయాలన్నారు. గురువారం నుండి ప్రారంభం కానున్న నామినేషన్ ప్రక్రియ సందర్భంగా నామినేషన్ దాఖలు చేయటానికి వచ్చేవారికి పాటించాల్సిన నిబంధనలు చెప్పాలని, వివాదాలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు అసెంబ్లీ, పార్లమెంట్ ▶ 2లో

షెడ్డు కార్మికులపై సిఎం వ్యాఖ్యలు దారుణం

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి

వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం షెడ్ కార్మికులకు వర్తింపజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఇటీవల సికె కన్వెన్షన్‌లో జరిగిన చేనేతల సమావేశంలో కోరగా అది కుదరదని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం సరికాదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం నాయకులు జె.శివభావన్నారాయణతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. షెడ్ కార్మికులు ఎప్పుడు ఎక్కడ మగ్గం నేస్తారో తెలియదని, అందువలన నేతన్న నేస్తం వర్తింపచేయం అని సిఎం మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి మంగళగిరిలో దీక్ష చేసినప్పుడు చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగంలో దెబ్బతీసే విధంగా విధానాలున్నాయని విమర్శించారు. ఏడాదికి బడ్జెట్లో రూ.2 వేలకోట్లు చేనేత కార్మికులకు కేటాయిస్తామని చెప్పి కేటాయించలేదని విమర్శించారు. సొంతిల్లు లేక అద్దె ఇట్లో ఉంటూ ఆదాయంలో సగం ఇంటి అద్దెలకు పోగా కుటుంబాలు

గడవడం కష్టమైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. మంత్రి ఆర్కే రోజా పవర్‌లూమ్ వస్త్రాలు తీసుకొచ్చి ఆప్కోలో అమ్మారని విమర్శించారు. సీఎం జగన్ మాట్లాడేటప్పుడు పక్కనే ఉన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడకపోవడం దారుణమన్నారు. చేనేతను రక్షిస్తానని చెప్పి ముఖ్యమంత్రి బక్షిస్తున్నారని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియా బ్లాక్ వేదిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్న శివశంకరరావును గెలిపించాలని కోరారు.

ఓట్లు అమ్మబడవని యానాది కాలనీవాసుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

అత్యంత నిరుపేదలమైన తాము ఏ రాజకీయపార్టీకీ అమ్ముడుబోమని, నిజాయితిగా తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకుంటామని, తమ ఓట్లు అమ్ముకోబోమని కాకుమానువారితోట ఐదో లైను యానాది కాలనీలో బహుజన మహసభ ఆధ్వర్యంలో 'ఇచ్చట ఓట్లు అమ్మబడవు' అని వినూత్నంగా నిరసన తెలిపారు. కాలనీవాసులందరూ ప్రతిజ్ఞ చేసి ఓట్లకు డబ్బులతో కొనలేరు అని రుజువు చేస్తూ మాకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. స్వాతంత్రం రాకముందు కేవలం కొన్ని ▶ 2లో

ట్రాక్టర్ బోల్తాపడి మహిళా కూలీ దుర్మరణం

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనతో పరిహారానికి అంగీకారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి ఒక మహిళ మృతి చెందగా ముగ్గురు మహిళలకు గాయాలైన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ల పంచాయతీ పరిధిలోని కొంకావారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద మంగళవారం జరిగింది. కొంకావారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన చిరుగూరి కృపారాణి (35), మరో ముగ్గురు మహిళలతో కలిసి గ్రామానికి చెందిన ఉదయరాజు పొలంలో పనుల కోసం ఆయన ట్రాక్టర్ ఇంజిన్ మీద వెళుతున్నారు. ట్రాక్టర్‌ను ఉదయరాజే నడుపుతున్నారు. వాహనం గ్రామ పొలిమేర వద్ద అదుపుతప్పి ▶ 2లో

జిల్లా వ్యాప్తంగా సాల్ట్ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ (సాల్ట్)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సంయుక్తంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుండి ఎంపిక చేసిన 129 పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న 3460 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, పాఠ్యాంశాలలో ఎంపిక చేసిన ఏవైనా రెండు పాఠ్యాంశాలలో స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ▶ 2లో

మూడు గ్రామాల్లో ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - యడ్లపాడు : మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఎన్నికల ప్రచారం చేపట్టారు. తిమ్మాపురం, లింగారావుపాలెం, కారుచోలలో కార్యకర్తలు బైక్ ర్యాలీలు చేయగా అభ్యర్థులు ప్రచారం రథంపైనుండి రోడ్‌షోగా ప్రజలకు అభివాదం చేశారు. తిమ్మాపురం, లింగరావుపాలెంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. వైసిపి మండల అధ్యక్షులు ఘంటా శంకర్, ఎంపిపి పి.ఝాన్సీసాగర్, జెసిఎస్ కన్వీనర్ ఆర్.చింతారావు, పి.వాసు, ఆర్.రామారావు పాల్గొన్నారు.

సామాన్యుల కష్టాలు తీర్చేలా సూపర్ సిక్స్ పథకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సామాన్య ప్రజల కష్టాలు తీర్చేలా ఉన్నాయని టిడిపి పల్నాడు జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. రొంపిచర్ల మండలంలోని రెడ్డిపాలెంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.20 వేలు పంట పెట్టుబడి సాయం పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రస్తుత సిఎం బటన్ నొక్కుతున్నా డబ్బులు జమవ్వక లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. చిరు వ్యాపారుల, కుమ్మరి, చేనేత కార్మికులు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టిడిపి ద్వారా సాధ్యమని, ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును గెలిపించాలని కోరారు. జి.సైదులురెడ్డి, జి.సుబ్బారెడ్డి, వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పిఆర్‌కె భార్య ప్రచారం

ప్రజాశక్తి - మాచర్ల : పేదల సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే జరిగిందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి భార్య రమా అన్నారు. పట్టణంలోని 12,13 వార్డుల్లో ఆమె మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. పేద,బడుగు వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను ఎక్కువగా అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదని వివరించారు. వైసిపిని గెలిపిస్తేనే పేదలకు మేలన్నారు.

కోర్టు ప్రాంగణంలో రక్త పరీక్షలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులకు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.థౌషీద్ హుస్సేన్ సూచించారు. సత్తెనపల్లి పట్టణంలో తాలూకా కోర్టు ప్రాంగణంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ కొంగర శ్రీకాంత్ పర్యవేక్షణలో సత్తెనపల్లి కొనాక్ డయాగ్నోస్టిక్ సౌజన్యంతో మంగళవారం ఉచితంగా రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.థౌషీద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ మాట్లాడారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పి.రవి, ఎం.వెంకటేశ్వరావు, టి.విజయ్ భరత్, ఎపిపి బి.నరసింహారావు, న్యాయవాదులు పరీక్షలు చేయించుకున్నారు.

తాగునీటి చెరువులు నింపే ప్రక్రియ కొనసాగుతుంది

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నాగర్జునసాగర్ కుడికెనాల్‌కు, కృష్ణా పశ్చిమ డెల్టా కెనాల్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం సరఫరా చేస్తున్న నీటి ద్వారా గ్రామాలు, పట్టణాల్లోని తాగునీటి చెరువులను ప్రణాళిక ప్రకారం నింపే ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డికి తెలిపారు. మంగళవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనుల, విద్యుత్ సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కృష్ణా పశ్చిమ డెల్టా కెనాల్ పరిధిలోని 31 తాగునీటి చెరువులు, నాగర్జున సాగర్ కుడికాల్వ పరిధిలోని 34 తాగునీటి చెరువులను ఇప్పటికే నింపినట్లు చెప్పారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని తాగునీటి చెరువులను రెండు రోజుల్లో నింపుతామన్నారు. గుంటూరు ఛానల్‌కు రెండు రోజుల్లో తాగునీరు సరఫరా అయ్యే అవకాశం ఉందని, దీని పరిధిలో ఉన్న 25 త్రాగునీటి చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వివరించారు.

24న నామినేషన్ వేస్తాం : గోపిరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి నరసరావుపే ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఎంపీ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్ యాదవ్ ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రెడ్డినగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నుండి భారీ ర్యాలీతో ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేస్తామని, భారీ సంఖ్యలో వైసిపి శ్రేణులు పాల్గొనాలని కోరారు.

టిడిపితోనే మైనార్టీల సంక్షేమం : బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ముస్లిమ్ మైనారిటీల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎన్‌డిఎ కూటమి తరుపున మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 28,29 వార్డుల్లో ఆయన మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఇదిలా ఉండగా ఎన్‌డిఎ కూటమి ముఖ్య నాయకులతో శ్రీకృష్ణదేవరాయలు తండ్రి లావు రత్తయ్య స్థానిక టిడిపి కార్యాలయంలో బ్రహ్మారెడ్డితో కలిసి సమావేశమయ్యారు.

పెరిగిన దాహం కేకలు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి పెరిగింది. సాగర్ జలాలను విడుదల చేసి వారం దాటినా ఇంత వరకు పెదనందిపాడు మండలంలోని పలు చెరువులకు పూర్తిగా నీరు రాలేదు. మొత్తంగా పల్నాడు జిల్లాలో 200 గ్రామాల్లో, గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. నాగార్జున సాగర్ జలాశయం ద్వారా కాల్వలకు ఈనెల 8వ తేదీ నుంచి రోజు 5500 క్యూసెక్కుల నీటిని ఈనెల 18 వరకు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కుడికాల్వ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని అధికారులు అందరూ తమ పరిధిలో 461 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు తాగునీరు నింపుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాపశ్చిమ డెల్టాలో 65 చెరువులకు నీరు చేరినట్టు అధికారులు చెబుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో నీరు చేరలేదని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. చిలకలూరిపేటలో చెరువుకు పూర్తి స్థాయిలో నీరు రాకపోవడం వల్ల పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. చిలకలూరిపేట, వినుకొండ, ప్రత్తిపాడు, తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు కూడా తగ్గిపోయి గ్రామాల్లోని బోర్లు కూడా పనిచేయడం లేదు.

మరోవైపు నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లోనీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. పులిచింతల జలాశయంలో గరిష్టనీటి నిల్వ 45.77 టీఎంసీలు కాగా మంగళవార ం ాత్రి కేవలం 4.99 టీఎంసీలకు నీటి నిల్వ మాత్రమే ఉంది. సాగర్ జలాశయం నుంచి 31,435 క్యూసెక్కులు వస్తుండగా 3821 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజి నుంచి కాల్వల ద్వారా చెరువులను నింపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏడాది ఇదే రోజుల్లో పులిచింతలలో నీటి నిల్వ 20 టీఎంసీల నిల్వ ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం 4.99 టీఎంసీలే ఉంది. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటినిల్వ 312.01 టీఎంసిలు కాగా ప్రస్తుతం 129.84 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. మొత్తంగా ప్రధాన జలాశయాల్లో కనీస నీటి నిల్వలు లేకుండాపోతున్నాయి. పులిచింతలలో నీటి నిల్వలు రోజురోజుకు తగ్గిపోయి అడుగంటే పరిస్థితి నెలకొంది. పులిచింతలలో నీటినిల్వ బాగా తగ్గిపోవడం వల్ల ప్రకాశం బ్యారేజి వద్ద కూడా నీటి నిల్వ గణనీయంగా తగ్గిపోయింది. ప్రతిఏటా మే లో నీటిఎద్దడి వస్తుందని, కానీ ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో సమస్య తీవ్రరూపం దాల్చింది.

ట్రాక్టర్ బోల్తాపడి మహిళా కూలీ దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

పక్కనే ఉన్న కందకంలో బోల్తాపడింది. ఉదయరాజు ఒక వైపునకు దూకగా మహిళలు ముగ్గురూ ట్రాక్టర్ నుండి దూకలేకపోయారు. దీంతో కృపారాణి అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురు గాయపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలున్నారు. ఇదిలా ఉండగా పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహంతో మృతురాలి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై గంటపాటు బైటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇరుపక్షాలతో ఎస్ఐ చర్చించి మృతురాలి కుటుంబానికి పరిహారం ఇప్పించేలా ఒప్పందం కుదర్చడంతో ఆందోళన ముగిసింది.

రేపటి నుండి నామినేషన్ల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లనూ తిరస్కరించడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఎ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలని, నోటిఫైడ్ తేదీల్లో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరణ ఉంటుందని చెప్పారు. పబ్లిక్ సెలవు దినాల్లో నామినేషన్లను స్వీకరించబోరని తెలిపారు. అభ్యర్థులు గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చని, రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుండి అభ్యర్థులు నామినేషన్లను ఫైల్ చేయలేరని అన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్టంగా 3 వాహనాలకు అనుమతి ఉంటుందని, అభ్యర్థి సహా ఐదుగురికి రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఆఫీస్‌లోకి ప్రవేశించవచ్చని అన్నారు. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించవచ్చని, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అభ్యర్థి లేదా అభ్యర్థి ప్రపోజర్ లేదా ఏజెంట్ ద్వారా చేతితో డెలివరీ చేయబడిన క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింట్‌అవుట్ సంతకం చేయబడిన సిరాతో నామినేషన్ సమర్పించవచ్చని వివరించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎక్స్‌పెండీచర్ మానిటర్ (వ్యయ పర్యవేక్షణ)కు సంబంధించి నోడల్ అధికారులను నియమించామని, నియోజకవర్గాలోని అన్ని బృందాలు, నోడల్ అధికారులు, ఎన్నికల పరిశీలకులతో వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని అన్నారు. అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల ఖర్చుల ఖాతా సమర్పించడంలో శిక్షణిస్తామన్నారు. ప్రతి అభ్యర్థి యొక్క షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్, 'ఫోల్డర్ ఆఫ్ ఎవిడెన్స్' నిర్వహణ కోసం అకౌంటెంట్ బృందం అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ మార్గదర్శకత్వంలో పని చేస్తుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన తేదీ నుండి పోలింగ్ తేదీ వరకు వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారులు పని చేస్తామరని, వీరిమధ్య సమన్వయం అత్యంత ముఖ్యమని అన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుండి ఖర్చు అతని ఖాతాలో లెక్కించడం జరుగుతుందని చెప్పారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను అభ్యర్థి ఖాతా లో లెక్కిస్తామన్నారు. ఎన్నికల కోడ్ (ఎంసిసి) అమలులో ప్రజలను కూడా ఎన్నికల కమిషన్ భాగస్వామ్యం చేసిందని, సీ-విజిల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్లో డౌన్లోడ్ చేసుకోవచ్చని, ప్రజలు వారి ఇంటి వద్ద నుంచే పోస్టర్లు, పాంప్లెట్లు పంపిణీ, ఎంసిసి ఉల్లంఘనలపై తమ దృష్టికి తీసుకురావచ్చని వివరించారు. సీ-విజిల్ యాప్ ఫిర్యాదులను సరాసరి 31 నిమిషాల్లోనే పరిష్కరిస్తున్నామని, నాణ్యతగా ఫిర్యాదులకు పరిష్కారం చూపిస్తున్నామని, అన్ని ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

నామినేషన్లప్పుడు వివాదాలకు ఆస్కారమివ్వొద్దు : ఐజి

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ స్టేషన్‌లు, చెక్‌పోస్టుల వివరాలు వనరబుల్ మ్యాప్, ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు, విధులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐజీకి ఎస్పి తుషార్ దూడి వివరించారు. ఓటు హక్కును ప్రజలు నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రతిఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని చెప్పారు. ముఖ్యమైన కూడళ్ళు, విఐపి జోన్‌లలో సిసి కెమెరాలను పటిష్టం చేయాలని, సంఘ వ్యతిరేక శక్తులను ముందుగానే గుర్తించాలని అన్నారు. అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచకేట్ సెల్కి, అదనపు ఎస్‌పిలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, హనుమంతు, ట్రైనీ ఐపిఎస్ మనోజ్ హెగ్డే పాల్గొన్నారు.

ఓట్లు అమ్ముబడవని యానాది కాలనీవాసుల ప్రతిజ్ఞ

(మొదటి పేజీ తరువాయి)

వర్గాల వారికే ఓట్లుండేవని, బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఈ దేశంలో పుట్టిన ప్రతి వయోజనులకూ ఓటు హక్కు కల్పించారని బహుజన మహాసభ అధ్యక్షులు జి.ఆర్.భగత్ సింగ్ అన్నారు. ఇప్పటికీ చాలా మందికి ఆధార్ కార్డు, ఓటు లేక, చదువు, నివాసం లేక రోడ్లపక్కనే జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సిపిడిసిఎల్ రిటైర్డ్ సిజిఎం కె.భాస్కర్, షేక్ ఖాజావలి, ప్రముఖ న్యాయవాది పి.ప్రసాదరావు, బహుజన ప్రజా చైతన్య వేదిక అధ్యక్షులు డి.సురేష్, న్యాయవాదులు ఆర్.మణికుమార్, వెంకటేశ్వరరావు, అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ నాయకులు బి.విల్సన్, వి.ముత్తయ్య, రవికుమార్, జి.విజయ్ కుమారి, పి.గౌరీ శిరీష, బి.సుధాకర్, ఎ.కుమార్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా సాల్ట్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. మంగళవారం డిఇఓ పి.శైలజ స్థానిక గుంటూరు రూరల్ మండలంలోని అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. డిసిఇబి సెక్రెటరీ లలిత ప్రసాద్ నంబూరులోని గరల్స్ హైస్కూల్‌ను, సమగ్ర శిక్ష ఎపిసి విజయలక్ష్మి స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న భాషా, గణిత సామర్థ్యాలు అంచనా వేయటం కోసం ఈ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ డిఐ ఖాసిం, బిఎంఒ ప్రసాద్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో రాయితీ పొందండి : కమిషనర్

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 2024-25 సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై లభించే ఐదు శాతం రాయితీ పొందడానికి రెండు వారాలే గడువు ఉందని ఎంటిఎంసి కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదార్లు అధిక సంఖ్యలో సద్వినియోగం చేసుకోవ డానికి వీలుగా సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పన్ను చెల్లింపు కోసం ఎంటిఎంసి ప్రధాన కార్యాలయం, తాడేపల్లి కార్యాలయాల్లో ఉదయం 8 నుండి సాయంత్రం 8 గంటల వరకు పని చేసేలా, సచివాలయాల్లో అదనపు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాయితీ పొందాలని కోరారు.

పెమ్మసాని, ధూళిపాళ్ల ప్రచారంలో పవర్ కట్

పెదకాకాని మండలంలో పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర పర్యటించారు. రోడ్‌షో నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ గ్రామాల్లోని ప్రజలను కలిసి ఓటు అడిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పెమ్మసాని, ధూళిపాళ్ల ప్రచార కార్యక్రమాలను కొనసాగించారు. వీరి పర్యటన కొనసాగుతుండగా దాదాపు అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిచి నిలిచిపోయింది. కాగా పెమ్మసాని సెల్ఫోన్ లైట్ల వెలుగుల మధ్యనే ఆయన తన ప్రచారాన్ని ముందు కొనసాగించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యవసర సరుకుల ధరలు, కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు.

ఛార్జీల భారం వేయడం తప్ప గత ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని ప్రభుత్వం పనితీరుపై విరుచుకుపడ్డారు. పర్యటనలో పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఎంఆర్పిఎస్ నాయకులు మద్దతు ప్రచారం లో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా ఇంచార్జ్ కూచిపూడి సత్యం మాదిగ, మురికిపూడి హృదయ రాజు, మాదిగ, డేగల బాబు మాదిగ, ఆలపాటి కరుణా మాదిగ తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో 60శాతంపైగా యువత, విద్యార్థులు ఉన్నారని, దేశ ప్రజాస్వామ్య భవిష్యత్ వీరిపైనే ఉందని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో యువత విజ్ఞతతో అధిక సంఖ్యలో ఓటువేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. బుధవారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం అంటే ప్రజలు తమను తాము నియంతృత్వ ధోరణుల నుండి రక్షించుకోవటమేనన్నారు. 18 ఏళ్లు దాటిన యువత విద్యార్థులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. లెట్స్ ఓట్ సంస్థ జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి నాగభూషణం మాట్లాడుతూ

మాట్లాడుతున్న బాలాజీ శ్రీనివాస్

విద్యార్థులలో దేశ భక్తి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు చైతన్య కార్యక్రమాలు పాలకమండలి అధ్యక్ష అధ్యక్షులు కార్యదర్శి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల చేత ఓటు హక్కు ప్రమాణ పత్రం చదివి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెట్స్ ఓట్ సభ్యులు వి.సోమయాజులు, యం.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఫార్మసీ ప్రాక్టీస్ హెచ్ ఓ డి. నోరి హేమ కుమారితదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వైసిపి మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడేపల్లి కొత్తూరులో సచివాలయ కన్వీనర్లు దార్ల హేమ పద్మజ, దొంతిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, తాళ్లూరి ప్రభాత్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తూరు ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి పాల్గొన్నారు. కృష్ణుడిగుడి వద్ద సచివాలయ కన్వీనర్లు సింకా గంగాధర్, ఆళ్ల ఉమామహేశ్వరి, యాదిలి పూర్ణ శంకర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. క్లబ్ రోడ్డు, రాజరాజేశ్వరి నగర్ సచివాలయ పరిధిలో జక్కిరెడ్డి కృష్ణారెడ్డి మేకా వెంకటరెడ్డి, మహానాడు ప్రాంతంలో దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, కెఎల్‌రావు కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో సోమేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిన్నపోతుల దుర్గారావు, బందాపు రుక్మాంగ రెడ్డి, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, భూపతి కిషోర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్వర సమస్యలపై అవగాహన సభ

ప్రజాశక్తి-గుంటూరు :గొంతును జాగ్రత్తగా చూసుకునే మార్గాలతోపాటు గొంతు రుగ్మతలకు దారితీసే ప్రమాదాల గురించి, ఆధునిక చికిత్స విధానాల గురించి అందరూ తెలుసుకొని ఉండాలని ప్రముఖ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ వి.ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో సత్యసాయి వాయిస్ క్లినిక్ సహకారంతో ప్రపంచ వాయిస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్వరప్రాధాన్యత, స్వర సమస్యల గురించి తెలియజేస్తూ మానవ స్వరం గొప్ప వరమని, ఏ జీవరాసులలో లేని వోకల్ లీగమెంట్ అనే కండరం మానవుల స్వరనాడులలో మాత్రమే ఉందన్నారు. జీవనశైలి మార్పులు తగు చికిత్స ద్వారా వాయిస్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని అన్నారు. స్వరానికి అత్యంత ప్రమాదకారకాలు ధూమపానం, మద్యపానం అని, వాటిని పూర్తిగా మానేయటం ఉత్తమం అన్నారు. డీహైడ్రేషన్, కెఫిన్, ఆల్కహాల్ గొంతు, స్వరపేటిక నిర్జలీకరణానికి దారితీస్తాయన్నారు. స్వరనాడుల పెరాలసిస్ వల్ల స్వరం కోల్పోయిన వారికి, థైరాయిడ్ ఆపరేషన్ తర్వాత స్వరం కోల్పోయిన వారికి, గొంతు స్వరం మారిన వారికి షోనో సర్జరీ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం డాక్టర్ ఫణీంద్రకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సదాశివం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో
OS No:36/2021
బొల్లేపల్లి విజయలక్ష్మి ....వాది
మరియు
దీకొండ సీతారామయ్య వగైరాలు ..... ప్రతివాదులు
To,
D2) దీకొండ అనూష భర్త రామయ్య R/o రాజుపాలెం గ్రామం మరియు మండలం పల్నాడు జిల్లా.
D3) దీకొండ అక్షయ D/o రామయ్య .
D4) దీకొండ రాజశ్రీ D/o రామ్మయ్య.
D3, D4 మైనర్లు గార్డియన్ మరియు తల్లి అయిన ఢీకొండా అనూష w/o రామయ్య, R/o రాజుపాలెం గ్రామం మరియు మండలం పల్నాడు జిల్లా.
పై నెంబర్ దావా మరియు I.A. నెం. 257/2021లపై కోర్టు వారి నుండి ఎప్పటికి అనేక పర్యాయాలు నోటీసులు జారీ చేయించగా మీరు నోటీసులు తీసుకొని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం 25-04-2024 వాయిదా కావున వాయిదా రోజున ఉదయం 10:30 లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల దావా మరియు I.A.No. 257/2021 (గార్డియన్ పిటిషన్) మీ పరోక్షమందు తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా ది.25-04- 2024.
శ్రీ బి.అనిల్ కుమార్,
వాది తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యం.వి.ఓ.పి నెం.154/2022
భువనగిరి స్రవంతి మైనరు గార్డెయన్
తండ్రి భువనగిరి నరసింహారావు .... పిటీషనరు
వర్సెస్
టి.సతీష్ వగైరా .....రెస్పాండెంట్లు
పై నంబరున మైనర్ పిటిషనర్ మోటార్ వాహనం ప్రమాదం వలన తీవ్ర గాయాలు కాగా నష్టపరిహారం కోరుచూ మైనర్ గార్డియన్‌గా తండ్రిగారైన నరసింహారావు గారు పిటిషన్ దాఖలు చేసి ఒకటో రెస్పాండెంట్ తలతం సతీష్ తండ్రి వీరభద్రరావు డోర్ నెంబర్ : 3-26/1, పెనుమాక గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా
వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలాయాపన చేయుచుండుట చేత మీకు పేపర్ పబ్లికేషన్ నోటీసు జారీచేయించు లాగు ది:29-04-2024 తేదికి వాయిదా వేసినారు కావునపైతేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల తెలుపుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
కొమ్మనబోయిన పిచ్చయ్య
అడ్వకేట్
గోల్డెన్ టవర్స్, ఒంగోలు
ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 123/2023 IN O.S.312/2021
Between :
గుంటుపల్లి వెంకటేశ్వర్లు .... డి.హెచ్.ఆర్.
Vs
షేక్ సుఫియా .... జె.డి.ఆర్.
ఇందలి డి.హెచ్.ఆర్. తనకు రావలసిన బాకీ నిమిత్తము పై నెంబరు ఇ.పి. దాఖలు చేసి ఇందలి షెడ్యూలు ఆస్థిని శ్రీ కోర్టు వారి ద్వారా బహిరంగ వేలం వేయించి తనకు రావలసిన బాకీని ఇప్పించవలసినదిగా ఇ.పి.దాఖలు చేయగా సదరు ఇ.పి.లోని దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని బహిరంగవేలం వేయుటకు నిర్ణయించి శ్రీ కోర్టు వారు ది. 06-05-2024ను వేలం తేదీగా నిర్ణయించియున్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట ది. 06-05-2024వ తేదీన ఉ॥10-30ని॥లకు హాజరై శ్రీ కోర్టు వారు నిర్ణయించే షరతులకు లోబడి షెడ్యూలు ఆస్థిని వేలం లో పాడుకొనవలెను.
ఆస్థివివరము :-
షెడ్యూలు
ప్రస్తుత పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.డి., నరసరావుపేట స.డి. యిలాక నరసరావుపేట మున్సిపల్ లిమిట్స్‌లోని బరంపేటకు తూర్పు వైపుగా గల డోర్ నెం. 78/ఎ, టి.యస్.నెం. 70/3, 87బి2ఎ6, బ్లాక్ 2/3, పాత వార్డు నెం.1, కొత్తవార్డు నెం.2, ప్లాటు నెం. 77 రుగా గల 48.4 చ॥గ॥ కు సరియగు 40.46 చ॥మీటర్ల స్థలములోని 300 చ॥అ॥లలో కట్టబడిన రేకుల ఇల్లు గా గల ఆస్తికి హద్దులు.
తూర్పు : షేక్ మహబులా & ఇతరులు
దక్షిణం: సీతారావమ్మ మరియు వగైరాలు
పడమర : మున్సిపల్ బజారు
ఉత్తరము : మున్సిపల్ బజారు
ఈ నాలుగు హద్దుల మధ్యన గల 48.4 చ॥గ॥లకు సరియగు 40.46 చ.మీ. ఖాళీ స్థలములో 300 చ॥అ॥లలో కట్టబడిన రేకుల ఇల్లుతో సహా.
మార్కెట్ విలువ : రూ.7,19,135/-
డి.హెచ్.ఆర్. విలువ : రూ.3,00,000/-
అమీనా విలువ : రూ.5,00,000/-
వేలం వేయు తేది : 06-05-2024
శ్రీ కోర్టు వారి అనుమతితో
ఇట్లు
కొండా సాంబశివరావు
కె.ఆనంద్ కుమార్,
యం.సుబ్బారావు
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాదులు
నరసరావుపేట. సెల్. 9440249056

ప్రచార ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాశక్తి - నకరికల్లు

అనుమతులు లేకుండా ద్విచక్ర వాహనాలపై రాజకీయ నాయకుల ఫోటోలు పెట్టుకొనే ప్రచారం చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పైడి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని ద్విచక్ర వాహనంపై రాజకీయ నాయకుల ఫోటోలను పెట్టుకుని అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నాడు. మండల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్చార్జి ఎంపీడీవో జయమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం అమ్ముతున్న యువకుడు అరెస్టు

ప్రజాశక్తి - బెల్లంకొండ

మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మాచాయపాలెం ఆర్ అండ్ ఆర్ న్యూ చిట్యాల చెందిన ఎస్ సురేష్ నాయక్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో బెల్లంకొండ ఎస్సై ఎస్. రాజేష్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.అతని వద్ద 10 క్వార్టర్ బాటిల్స్ దొరికాయని కేసు నమోదు చేయటం జరిగిందని తెలిపారు.

41 మంది బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ముప్పాళ్ళ, ఉప్పరపాలెం, ఇనిమెళ్ళ, భద్రుపాలెం గ్రామాల లో 41 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మొహమ్మద్ ఫిరోజ్ మంగళవారం తెలిపారు. ఎన్నికలలో ఎటువంటి గొడవలలో పాల్గొనకుండా ఉండేలా రెండు లక్షల పూచికత్తు బాండు పై సంతకాలు చేయించుకొని తాసిల్దార్ బి దిలీప్ కుమార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్కీం ఉద్యోగుల జీతాలు తక్షణమే చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పని చేస్తున్న వివిధ కేడర్ల ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో రెండవ ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, అర్బన్ పిహెచ్‌సి ఉద్యోగులు, ఆశా వర్కర్లు తదితరులు పనిచేస్తున్నారని, గతనెల జీతం ఏప్రిల్ 15వ తేదీ దాటినా జీతాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు బ్యాంకు లోన్లు తీసుకున్న వారంతా ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవడంతో డిఫాల్ట్ కావడం, పెనాల్టీ భరించాల్సి వచ్చిందన్నారు. దీనికితోడు ఈనెల ఉగాది, రంజాన్ పండుగలు రావడం వల్ల అత్యధిక మంది ఉద్యోగులకు అదనపు ఖర్చులు కూడా ఉంటాయన్నారు. ఇలాంటి సందర్భంలో జీతాలు ఇంకా చెల్లించకపోవడంతో బయట నుంచి ప్రైవేటు వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సిన దుస్థితికి ఉద్యోగులు నెట్టబడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వకుండా, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చే జీతభత్యాలు కూడా ఇవ్వకుండా వివక్ష చూపించిందని, రెగ్యులరైజేషన్‌కి అర్హత లేకుండా చేసిందన్నారు. పైగా నెల నెల జీతాలు కూడా సకాలంలో చెల్లించకపోవడం ఉద్యోగులను మరింత వేదనకు గురి చేస్తుందన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బిఎస్పీ అభ్యర్థి ఆత్మీయ అభినందన సభ

ప్రజాశక్తి తెనాలి : బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థిగా సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేస్తున్న సునీల్ సందీప్‌ను పట్టణానికి చెందిన వీడియో గ్రాఫర్స్, వీడియో ఎడిటర్స్, ఫోటోగ్రాఫర్స్, ఆల్బమ్ డిజైనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించి సత్కరించారు. సునీల్ సందీప్ వృత్తిరీత్యా ఫోటో, వీడియో గ్రాఫర్. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి కూడా. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీ నుంచి తెనాలి అభ్యర్థిగా పోటీ చేయడానికి హర్షిస్తూ అభినందించారు. సునీల్ సందీప్ మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కోసం ఏర్పడిన పార్టీ బహుజన సమాజ పార్టీ అని, ఆ పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, నియోజకవర్గ అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని బహుజనులంతా తనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ సుధాకర్, మణికాంత్ బాబి, పి ఫ్రాంక్లిన్, కె.రవికుమార్, కాలేషావలి, వీడియోగ్రాఫర్లు ఫోటోగ్రాఫర్లు, ఆల్బమ్ డిజైనర్స్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అపార్ట్మెంట్ వాసులకు అవగాహన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వంటింట్లో గ్యాస్ సిలిండర్ లీకయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అపార్ట్మెంట్ వాసులకు అగ్నిమాపక సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని 5జీ అపార్ట్మెంట్ మహిళలుకు నిర్వహించిన అవగాహనలో గ్యాస్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలును అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంవీ సుబ్బారావు ప్రయోగాత్మకంగా వివరించారు. అంకమ్మ తల్లీ గ్యాస్ గోడన్ సిబ్బందికి, ఆఫీస్ సిబ్బందికి కూడా అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది ఎ.శ్రీనివాసరావు రామకృష్ణ, ,మోహన్‌బాబు, శ్రీనివాసరావు, సుభాని, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డు నందు గల రాయల్ పార్క్ అపార్ట్‌మెంట్ నందు నివాసం ఉంటున్న ప్రజలకు గ్యాస్ ఫైర్స్, ఎలక్ట్రికల్ ఫైర్స్ సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక కేంద్రం ఫైర్ అధికారి బి.నాగేశ్వరరావు వివరించారు. వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు భయం ఆందోళనకు గురికాకుండా కొద్దిపాటి మెలకువలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చని ప్రయోగాత్మకంగా వివరించారు. లోడింగ్ ఫైర్‌మెన్ ఎం.శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ కె.రవికుమార్, ఫైర్‌మెన్ జి.ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్, పి.బాష, డి.మహబూబ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు

క్రమశిక్షణ, నిబద్ధతే ఉన్నత స్థాయికి చేరుస్తాయి

ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్ 4వ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభలో వక్తలు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక కేసానుపల్లి ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల 4వ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ, నిబద్ధత, పెద్దలపట్ల గౌరవం వంటివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కల్పిస్తాయని చెప్పారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ షేక్ కరీం మొహిద్దిన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ నైపుణ్యాలను వృద్ధి చేసుకుని మంచి అవకాశాలు పొందాలని, కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

ఆదాయాలకు చిరుగులు.. జీవనోపాధికి అతుకులు..

- పాత వస్త్ర వ్యాపారాలకు గడ్డుకాలం
- వ్యవసాయం తగ్గి ప్రతికూల ప్రభావం

- అప్పుల ఊబిలో 64 కుటుంబాలు
- రాయితీ రుణాలిచ్చి ఆదుకోవాలని విన్నపాలు

వరవకట్ట వద్ద పాత బట్టల దుకాణ సముదాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో వరవకట్ట ప్రాంతంలో 40 ఏళ్లకు పైగా 64 కుటుంబాలకు చెందిన చిరు వ్యాపారులు పురపాలక సంఘానికి చెందిన స్థలానికి అద్దెలు చెల్లిస్తూ తాత్కాలిక వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుని పాత బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 40 ఏళ్ళ నుండి పాత బట్టల వ్యాపారం చేసుకుంటున్నా వారికి వచ్చే ఆదాయం అంతంతమాత్రమే. కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో పెద్దగా అభివృద్ధి లేకపోగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో తిరిగి ప్లాస్టిక్, స్టీల్, సిల్వర్, సామానులు మారు బేరానికి ఇచ్చి వాటికి ప్రతిగా వినియోగానికి అనుకూలంగా వుండే పాత బట్టలు తీసుకుంటారు. వాటిపై కొంత రాబడి చూసుకుని అమ్ముకునేవారు. ప్రస్తుతం చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి మహానగరాల్లో వీరిమాదిరే పాత బట్టల వ్యాపారస్తుల దగ్గర కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు.

వ్యవసాయ రంగానికి, పాత వస్త్రాల వ్యాపారానికి అనుబంధాన్నీ వీరు గుర్తు చేస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నప్పుడు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుండి వలస కూలీలు వచ్చిన సందర్భంలో వస్త్ర వ్యాపారం జోరుగా ఉంటుందని విక్రేతలు చెబుతున్నారు. అడవి పందుల నుండి పంటలను కాపాడుకునేందుకు పంట పొలానికి కంచెలా పాత చీరలు ఏర్పాటు చేస్తుంటారు. ప్రస్తుతం వ్యవసాయం తగ్గిపోవడం, పనులు లేకపోవడంతో ఈ ఏడాది అమ్మకాలు లేక విక్రేతలు నీరసించారు. గతంలో అమ్మకాలు బాగున్న రోజుల్లో విక్రేతలు ఉపాధి పొందడంతో పాటు ఇతరులకూ కొంత ఉపాధి చూపేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకపోవడంతో ఇంటిల్లపాది దుకాణం నిర్వహణ, బట్టలు వేరు చేయడం వంటి పనులు చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుండి పాత బట్టలు కొనుగోలు చేసి జీవనం సాగించే తమలాంటి చిరువ్యాపారులను ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు రాయితీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని వీరు కోరుతున్నారు.

రవాణా ఖర్చులు, పన్నులు భారమయ్యాయి

40 ఏళ్లకు పైగా పాత బట్టల వ్యాపారమే మా జీవనాధారం. గతంలో కొందరు కూలీలను పెట్టుకుని సైకిళ్లపై వ్యాపారం చేసేవాళ్లం. తర్వాత కాలంలో ద్విచక్ర వాహనాలపై నరసరావుపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో తిరిగి పాత వస్త్రాలను సేకరించాం. వాటిని స్త్రీ, పురుషుల, చిన్నారుల దుస్తులుగా వేరు చేసేందుకు కొందరు కూలీలను పెట్టుకునే వాళ్లం. బాగుండే బట్టలను జీన్స్, ప్యాంట్లు, టీ షర్టు, షర్టులు, ఖాకీ డ్రెస్సులు వేరు చేసి కాస్త రాబడి చూసుకుని అమ్ముకునేవాళ్లం. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. ఇతర రాష్ట్రాల నుండి, ఫ్యాక్టరీల నుండి పాత బట్టలు కొంటున్నాం. చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి మహానగరాలు నుండి తెస్తున్న క్రమంలో రవాణా ఖర్చులు, పన్నులు భారంగా మారుతున్నాయి.

కుంచపు పెద్దిరాజు.

కరోనా తర్వాత అమ్మకాలు పడిపోయాయి

కరోనా దగ్గర నుండి వ్యాపారం అంతగా సాగడం లేదు. ఇది కాకుండా మరో పనులు చేయలేం. నేను, నా భార్య ఉదయం నుండి రాత్రి వరకు దుకాణంలోనే ఉంటాం. కొనుగోళ్లకు ఇతర ప్రాంతాలకు వెళ్లినపుడు మా అబ్బాయి దుకాణంలో ఉంటాడు. మహానగరాల్లో ప్రజలు బట్టలు కొంచెం చిరిగినా, ఒంటికి నప్పకపోయినా వాటిని పాత బట్టల దుకాణంలో అమ్మే విధానం ఉంది. అక్కడి దుకాణదారుల వద్ద బట్టలతో పాటు కొన్ని వస్త్ర దుకాణాల్లో అమ్ముడుపోని రెడీమేడ్ దుస్తులు 10 రోజుల పాటు అక్కడే ఉండి తెచ్చుకుంటున్నాం. రవాణా ఖర్చులు, పన్నులే గాక స్థానికంగా మున్సిపాల్టీకి అద్దెలూ చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం రాయితీ రుణాలిచ్చి సహకరించాలి.

తురకా పెద్దిరాజు.

36 మంది విద్యార్థినులకు సైకిళ్లు

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం అసిస్టు ప్రాంతీయ కార్యాలయంలో ఆసిస్టు, ఐఎస్‌పి ఇటలీ సహకారంతో 36 మంది హైస్కూల్ విద్యార్థినులకు రూ.2.16 లక్షలతో సమకూర్చిన సైకిళ్లను మంగళవారం పంపిణీ చేసినట్టు బొల్లాపల్లి మండలం అసిస్ట్ ఏరియా కో-ఆర్డినేటర్ ఆలా శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయం లేని బొల్లాపల్లి మండలంలోని 15 గ్రామాలకు చెందిన హైస్కూల్ విద్యార్థినులను గుర్తించి సైకిళ్ల పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్ట్ కార్యకర్తలు బి.కమల నాయక్, ఎం.ఆదిలక్ష్మి, ఎస్.వెంకయ్య, సిహెచ్ నాగేంద్రం పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం

ప్రారంభించిన డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి - 10 రోజులపాటు కేంద్రం నిర్వహణకు రూ.30 వేలు వితరణ

కేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని వంశీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించడంతోపాటు మజ్జిగ చలివేంద్రానికి 10 రోజులకు అవసరమైన రూ.30 వేలను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా పిఎస్‌వికె కన్వీనర్ పొట్టి సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ పిఎస్‌వికె ఆధ్వర్యంలో సందర్భానుసారంగా, ప్రజల అవసరాలను బట్టి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కరోనా ఐసోలేషన్ సెంటర్, ఉచిత న్యాయ సేవకేంద్రం, వైద్యశిబిరాలను దాతల సహకారంతో నిర్వహించినట్లు వివరించారు. అందులో భాగంగానే ప్రతి వేసవిలో మాదిరి ఈ ఏడాదీ మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ మజ్జిగ కేంద్రం నిర్వాహణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిఎస్‌వికె నిర్వాహకులు టి.వెంకటేశ్వర్లు, కె.జగన్, కె.మాధవి, ఎ.వెంకటనారాయణ, గద్దె చలమయ్య, ప్రజా సంఘాల నాయకులు గుంటూరు విజయ్ కుమార్, ఎవిఎన్ గోపాలరావు, కె.శివదుర్గారావు, ఐ.లింగయ్య, పి.వీరేశం, డి.విమల, జి.ఉమశ్రీ, టి.రాము, జి.రజిని, పి.మహేష్, పి.మహేశ్వరి, జి.మల్లేశ్వరి, సుధారాణి, కె.రమాదేవి, పి.శేషు, ఎం.జ్యోతి, ఐ.అరుణ పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపుతోనే ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యం

సిపిఎం మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు

తాడేపల్లి, తాడేపల్లి రూరల్‌లో సిపిఎం శ్రేణుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :స్థానిక ప్రజా సమస్యలు, పేదల సమస్యల పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మంగళగిరి నియోజకవర్గ శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండలో సిపిఎం నాయకులతో కలిసి, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మండల ప్రాంతంలో సిపిఎం ప్రజా ప్రతినిధులు పనిచేసిన సమయంలోనే ఈ ప్రాంత అభివృద్ధి జరిగిందన్నారు. ప్రధానంగా పేదలు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, ఇళ్లపట్టాల సమస్యల పైన నిరంతరం పోరాటం చేసేది ఒక్క ఎర్ర జెండా మాత్రమేనన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల బాండ్ల విషయంలో పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు అప్పనంగా దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వ నిరంకుశత్వంపై వామపక్ష పార్టీలు నిరంతరం పోరాడతాయని ఆయన అన్నారు. రానున్న ఎన్నికలలో మతోన్మాద బిజెపిని, కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీలను, రాష్ట్రంలో నిరంకుశ వైఖరితో మోడీ విధానాలు అమలు చేస్తున్న వైఎస్సార్సీపీ పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌కు కంకి, కొడవలి గుర్తు పైన, మంగళగిరి అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ముస్లింల పైన, మైనార్టీల పైన, దళితులపైన దాడులు పెరిగాయని అన్నారు. ఇప్పటికే రైతాంగ చట్టాలను, కార్మిక చట్టాలను, సిఏఏ వంటి చట్టాలను మార్చి, వివిధ వర్గాల ప్రజల పైన అనేక భారాలు వేసిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు బి. ముత్యాలరావు, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు కాజా వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ శివన్నారాయణ, కొలనుకొండ గ్రామ మాజీ ఎంపిటీసీ మెగావత్ వెంకటేశ్వరరావు నాయక్, పల్లె కష్ణ, కంచర్ల సాంబశివరావు , కొలనుకొండ సిపిఎం నాయకులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, గొట్టిపాటి కోటేశ్వరరావు, కాట్రగడ్డ బాబు, కాట్రగడ్డ పూర్ణయ్య, పల్లె భార్గవ్,కారసాల స్వాతి, కారసాల శౌరి, నాయక్, ఎస్ కే భాష, తదితరులు పాల్గొన్నారు.

కొలను కొండలోని ఆక్సా నగర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

ధరలు పెంచిన వారిని ఓడించండి

ప్రజాశక్తి-తాడేపల్లి : గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పెంచిన బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు ప్రజలను కోరారు. మంగళవారం రాత్రి తాడేపల్లి అంబేద్కర్ కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య అధ్యక్షతన సమావేశంలో సూర్యారావు మాట్లాడుతు్న రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెడతామన్న మనువాద శక్తులను తిప్పికొట్టాలని కోరారు. తాడేపల్లి ప్రాంతంలో పేదలకు అండగా నిలిచి పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లపట్టాలు, ఇళ్లు వచ్చిన చరిత్ర ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులకు ఉందన్నారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం, గుంటూరు పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న సిపిఎం, సిపిఐ అభ్యర్థులు జొన్నా శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్యేలు మాట్లాడుతూ సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమై పని చేసేది వామపక్షాలేనని, కాంగ్రెస్ పార్టీ తన సంపూర్ణ మద్దతు వామపక్షాలకు తెలియజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కూచిపూడి శ్రీనివాసరావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని నులకపేట రామయ్య కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, వేముల దుర్గారావు, బాష మాట్లాడారు. బిజెపికి తొత్తులుగా ఉన్న పార్టీలను ఓడించాలని కోరారు. కొత్తూరులో కరపత్రాలు పంచుతూ సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, డివి భాస్కరరెడ్డి, డి.యోహాన్, ఎం.శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, దావీద్, వై.శ్రీనివాసరావు, కె.మేరి పాల్గొన్నారు.

తాడేపల్లి అంబేద్కర్ కాలనీలో మాట్లాడుతున్న ఎం సూర్యారావు

తాడేపల్లి నులకపేట ప్రచారంలో మాట్లాడుతున్న వై నేతాజీ

18న ఇండియా వేదిక విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేట్ మతోన్మాద బిజెపి మిత్రులను, లోపాయి కారిగ మోడీతో జతకట్టిన వైసీపీని ఓడించాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. 18వ తేదీన మంగళగిరి సిపిఐ కార్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు మంగళగిరి నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగే ఇండియా బ్లాక్ వేదిక పార్టీల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఇండియా బ్లాక్ వేదిక ఏర్పాటు అయిందని వారు అన్నారు. సమావేశంలో అభ్యర్థి జొన్నా శివశంకరరావు, సిపిఎం నాయకులు జెవి రాఘవులు, ఎస్ఎస్ చంగయ్య, వై కమలాకర్, సిపిఐ నాయకులు చిన్న తిరపతయ్య, జాలాది జాన్‌బాబు, వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి అతిథి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక కలెక్టరేట్ రోడ్డులోని రహదారులు, భవనాల శాఖ అతిథి గహంలోని గదులను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. జిల్లాలో సార్వత్రిక సాధరణ ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు ఎన్నికల సంఘం నియమించిన అబ్జర్వర్లకు వసతి కల్పించేందుకు ఆర్అండ్‌బీ అతిథి గహంలోని గదులలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నోడల్ అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషాకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, అర్అండ్‌బీ ఈఈ సమర్పణరావు, రెవెన్యూ అధికారుల పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు కోటయ్య మృతి

ఉపాధి హామీ పనిచేస్తుండగా గుండెపోటు

ఆస్పత్రికి తరలించేలోపే తుదిశ్వాస విడిచిన కోటయ్య

సిపిఎం, రైతు, ప్రజా సంఘాల నాయకుల నివాళి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు, దుగ్గిరాల మండల కమిటీ సభ్యులు ఈమని కోటయ్యగా పిలుచుకునే కొండూరి కోటేశ్వరరావు (58) మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఉపాధి హామీ పనిలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్ గుర్తించి ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కోటయ్యకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు నాగరాజు సంగం డెయిరీలో పనిచేస్తుండగా, పెద్ద కోడలు గృహిణి, రెండో కుమారుడు రాజేంద్ర ఆర్‌పిఎఫ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా రెండో కోడలు పోస్టల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. సిపిఎం సీనియర్ నాయకులు వల్లభనేని సాంబశివరావు స్ఫూర్తితో 1978లో యువకుడిగా ఉన్న సమయంలో సిపిఎం పట్ల ఆకర్షితులైన కోటయ్య తుదిశ్వాస విడిచేవరకూ పార్టీలోనే ఉన్నారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు వల్లభనేని సురేష్, మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎస్.ఎస్.చంగయ్య, ఎన్ భావన్నారాయణ, జిల్లా నాయకులు భైరగాని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, కృష్ణా జిల్లా గుడివాడ పట్టణ కమిటీ సభ్యులు అరుణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటయ్య కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. భౌతికకాయంపై రైతు సంఘం పతాకాన్ని ఉంచారు.


కొండూరి కోటేశ్వరరావు (ఫైల్)

ఉపాధి చేసుకుంటూనే ఉద్యమాల్లో చురుకైన పాత్ర

ఉపాధి చేసుకుంటూనే పార్టీ ఉద్యమాల్లో తనవంతు పాత్ర పోషించారు. ముఖ్యంగా వల్లభనేని సాంబశివరావు సహకారంతో దళితుల ఇళ్లస్థలాల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. కలెక్టర్‌కు కనీసం 20 సార్లకుపైగా వినతిపత్రాలు సమర్పించారు. అలాగే గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావుకు ఒక సమస్యపై అత్యధిక వినతులు సమర్పించారు. ఆయన పోరాటం ఫలితంగా ఈమని గ్రామం మొత్తం ప్రభుత్వాధికారులు సర్వే నిర్వహించారు. ఒక గ్రామం మొత్తాన్ని సర్వే నిర్వహించడం అప్పట్లో సంచలనమైంది. అనంతరం మహిళల హక్కుల కోసం, రోజువారీ కూలీలు, శ్రామికుల హక్కులు, కనీస వేతనాల కోసం జరిగిన పోరాటాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. తుదిశ్వాస వరకూ ప్రజా సంక్షేమం కోసం సిపిఎం తరుపున నిఖార్సుగా, నిజాయితీగా నిలబడ్డారు.

అంకితభావంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

కోటయ్య మరణం దుగ్గిరాల మండలంలో సిపిఎం ఉద్యమానికి తీరనిలోటని పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కోటయ్య భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నిజాయితీగా పార్టీలో పనిచేసిన కోటయ్య హఠాన్మరణం కలిచివేసిందని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని అంకితభావంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు.

కోటయ్య మరణం తీరనిలోటు

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

పేద కుటుంబంలో పుట్టినప్పటికీ వ్యవసాయ కార్మికులతోపాటు రైతులు, కౌలు రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన కోటయ్య మరణం ఉద్యమానికి తీరనిలోటని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. మంగళవారం కోటయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దుగ్గిరాల మండలంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం ఆయన పోరాడారని తెలిపారు.

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సంతాపం

కోటయ్య మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఈమనిలో ఇళ్లస్థలాల పోరాటంపై పదులసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారని తెలిపారు. అక్కడ పేదలకు ప్రభుత్వం స్థలాలు పంచడంలో, అర్హులైన వారికి పెన్షన్లు ఇప్పించడంలో కోటయ్య చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

కోటయ్య మరణవార్త తెలిసిన వెంటనే సిపిఎం మండల నాయకులు ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, గుడిసె యోహాను, స్థానిక నాయకులు కె.ప్రసాదు, మండల కమిటీ సభ్యులు యేమినేని స్టాలిన్, టిడిపి సీనియర్ నాయకులు అంచె మారుతీవరప్రసాదు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేని శ్రీను, టిడిపి నాయకులు సాయికృష్ణ, కె.దేవదాసు, మార్కు, కృష్ణ తదితరులు నివాళులర్పించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఈమనిలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

కోటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వి కృష్ణయ్య, జొన్నా శివశంకర్, జెవి రాఘవులు, పాశం రామారావు, ఈమని అప్పారావు తదితరులు

వీడియో రికార్డింగ్ చేస్తూ వాహన తనిఖీలు : జెసి

ప్రజాశక్తి - మాచర్ల

బోర్డర్ చెక్ పోస్టు వద్ద వీడియో రికార్డు చేస్తూ సమగ్రంగా తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం బోర్డర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలను ఆయన పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి సీజ్‌లను ఇఎస్ఎంఎస్ పోర్టల్‌లో నివేదించాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు నివేదించాలన్నారు. ఆయన వెంట మాచర్ల తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి తదితరులున్నారు.

శాంతిభద్రతల సమస్య రాకుండా పటిష్ట చర్యలు

మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురజాల డిఎస్‌పి, సిఐలు, ఎస్‌హెచ్‌ఓలతో ఆయన తన కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. నామినేషన్ ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రచారానికి ఇవ్వవలసిన అనుమతులు, చెక్‌పోస్టు వద్ద తనిఖీలు, పోస్టల్ బ్యాలెట్, ఇంటింటి ప్రచారం తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో రూరల్, టౌన్ బిఎల్ఓలతో సమావేశం నిర్వహించి హోమ్ ఓటింగ్, పెండింగ్ క్లెయిమ్స్, ఇతర ఎన్నికల విధుల గురించి చర్చించారు.

శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలపై మంగళవారం తన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో జెసి సమీక్షించారు. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన రథోత్సవం రోజున అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీని నియంత్రిస్తూ, సెక్యూరిటీ, క్యూలైన్లు కొరకు బ్యారికేడింగ్‌లను పోలీసులు పర్యవేక్షించాలన్నారు. ఆలయ ప్రాంతంలో లిక్కర్ అమ్మకాలు జరగకుండా సెబ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రథం వెళ్లే ప్రాంతంలో విద్యుత్ వైర్ల తొలగింపు, లైటింగ్ అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుధ్యం రథం తిరిగే బజార్‌లో రహదారి మరమ్మతులపై మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆర్ అండ్ బి వారు రథానికి ఫిట్‌నెస్ చూడాలన్నారు. రథం రిపేరు పనులను కెసిపి సంస్థ వారు చూస్తారని వివరించారు. ఐడి కార్డ్స్ జారి ప్రక్రియను రెవిన్యూ వారు చూస్తారని చెప్పారు. ప్రసాదాలను, వాటర్, మజ్జిగ తదితర పంపణి చేసే దాతలకు సహకారాన్ని అందించాలన్నారు.

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటేసేలా బందోబస్తు : ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి మండలం గుండ్లపాడు, కండ్లకుంట, కెపి గూడెం, గొట్టిపాళ్ల, సిరిగిరిపాడు, వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధారణ అనే విధంగా విభజించామని, దానికి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. స్థానికులతో మాట్లాడి గత ఎన్నికల సమయంలో తలెత్తిన వివాదాలు, సమస్యలపై తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి గురించి ప్రజలకు వివరించారు. నిబంధనలు ఉల్లంఘనలకు ఎవరైనా పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సిరిగిరిపాడులోని జిల్లా చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ ఏ.పల్లపురాజు, మాచర్ల రూరల్ సిఐ కె.సురేష్, వెల్దుర్తి ఎస్ఐ వి.శ్రీహరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గద్దం బాల నాగమ్మ

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎంపిపి గద్దం బాలనాగమ్మ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ పనులు, ఇతర అంశాలపై చర్చించారు. ఎంపిపి బాలనాగమ్మ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వ్యవసాయ పనులు ముగియడం వలన కూలీలు పనుల్లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఉపాధి హామీ పనులు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ సిహెచ్.వి.లక్ష్మీకుమారి, వైస్ ఎంపిపి ఐ.మాధవి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలం కేంద్రమైన యడ్లపాడులోని శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రంథాలయంలో ఉన్న వసతులు, వస్తున్న పాఠకుల సంఖ్య, అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలపై గ్రంథాలయ అధికారి అంజమ్మతో మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధినీ దోచారు : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని కూడా దోచుకున్న పాలకుడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పత్తిపాటి గార్డెన్స్‌లో భవన నిర్మాణ కార్మికులతో మంగళవారం సమావేశమైన పుల్లారావు మాట్లాడుతూ జగన్ విధానాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది వరకున్న భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇసుక లేక, పనులు దొరక్క ఆత్మహత్యలు చేసుకున్న భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను కనీసం ఆదుకోలేదన్నారు. 2019 నుంచి పెండింగ్‌లో పెట్టిన పరిహారాలన్నీ తక్షణమే చెల్లించాలని ఆందోళన చేస్తే కేసులు పెట్టించారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పథకాలన్నీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు.

హోం ఓటింగ్‌లో రాజకీయ పార్టీల జోక్యం వద్దు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో హోమ్ ఓటింగ్‌పై రాజకీయ పార్టీల జోక్యం లేకుండా నేరుగా ఓటర్లకు అవగాహన కల్పించాలని బిఎల్వోలకు సత్తెనపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ సూచించారు. ఈ మేరకు సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ 80 ఏళ్లు పైబడి మంచానికే పరిమితమైన ఓటర్లుకు ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించిందని చెప్పారు. నేరుగా వారిని గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. ముందుగా వారికి హోమ్ ఓటింగ్ దరఖాస్తు ఫారాలు

బిఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

ఇవ్వాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించాలన్నారు. ఎన్నికల్లో ఓటర్ స్లిప్పులు పంపిణీలో రాజకీయ నాయకులు ప్రమేయం లేకుండా నేరుగా ఓటర్లకు మీరే పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉషా, మున్సిపల్ కమిషనర్ కె.షమీ పాల్గొన్నారు.

చెరువుల్లో నీరు టిడిపికి కనిపించడం లేదా : వైసిపి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని సింగర చెరువును వైసిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం పరిశీలించారు. తాగునీటి అవసరాలకోసం నీటిని విడుదల చేయగా వినుకొండ ప్రజలకు తాగునీరు కొరకు సింగర చెరువును పూర్తి స్థాయిలో నింపుతున్నామని తెలిపారు. ఇప్పటికే వినుకొండలో నీటి సమస్యను పరిష్కారానికి అనేక విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇంతగా నీటి సరఫరాపై శ్రద్ధ చూపే తమ ప్రభుత్వంపై టిడిపి దుష్ప్రచారం చేస్తోందని, వారికి సింగర చెరువు నీరు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికే 1, 2 చెరువులు నింపామని, మరో రెండ్రోజుల్లో ఇంకో చెరువును నింపుతామని అన్నారు.

17వ వార్డులో బొల్లా అల్లుడు ప్రచారం

పట్టణంలోని 17వ వార్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు అల్లుడు గంగధర్ ఇంటింటి ప్రచారం చేశారు. అభివృద్ధి కొనసాగాలంటే బ్రహ్మనాయుడును మళ్లీ గెలిపించాలని, ఎంపీగా అనీల్ కుమార్ యాదవ్‌నూ గెలిపించాలని కోరారు.

'న్యాయం చేసిన వైసిపికి అండగా నాయీబ్రాహ్మణులు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాయీబ్రాహ్మణుల మద్దతు వైసిపికేనని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ సిద్ధవటం యానాదయ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పల్నాడు రోడ్డులోని వైసిపి పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో యానాదయ్య మాట్లాడారు. పనుల చేసుకునే వాళ్లని పాలకులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో తమ సమస్యను చెప్పుకోటానికి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిస్తే 'మీతోకలు కత్తిరిస్తా'అని అవమానించారని చెప్పారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ 25 పార్లమెంటు స్థానాలకు గాను దాదాపు100కు పైగా బీసీలకు జగన్ కేటాయించారని, బీసీలు సీఎంలుగా ఉన్న రాష్ట్రాలలో ఇంత న్యాయం జరగలేదని అన్నారు. నరసరావుపేట పార్లమెంట్ బిసి అభ్యర్థి అనీల్ కుమార్‌యాదవ్‌ను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా 'జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం' అని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోటప్పకొండ దేవస్థానం బోర్డు మెంబర్ అట్లూరి బాలసుబ్రమణ్యం, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్, వైసిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి నందిని రాజకుమార్, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిల్లుట్ల శ్రీనివాసులు, వి.వీరాంజనేయులు, జి.శ్రీనివాసరావు, ఎం.పున్నారావు, జి.సాంబశివరావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

టిడిపితోనే వాల్మీకిబోయల సంక్షేమం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వాల్మీకి భోయ సామాజికవర్గ సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలో వాల్మీకి భోయ సామాజికవర్గాలతో మంగళవారం ఆత్మీయ సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఒరిగింది ఏమీ లేదన్నారు. వాల్మీకి బోయ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే వాల్మీకి బోయల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తనతోపాటు ఎంపీ అభ్యర్థిగా శ్రీకృష్ణదేవరాయలకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
బుధవారం 17 ఏప్రిల్ 2024

మంగళగిరి పట్టణంలో 25 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలో 25 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. 26వ వార్డు 15వ సచివాలయంలో 12 మంది సిబ్బంది రాజీనామా చేశారు. అలాగే 27 వార్డు 16వ సచ్చివాలయ పరిధిలోని 13 మంది రాజీనామాలు చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రజలకు సేవ చేసేందుకు తమను నియమిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో తామను ఎన్నికల కోడ్ పేరుతో ఆపటంతో తాము ఒకింత అవేదనతో నేడు రాజీనామా చేశామని వాలంటీర్లుతెలిపారు. ఖచ్చితంగా ప్రజల కోసం తాము పని చేయటం జరుగుతుందని కేవలం తమ విధులకు హాజరు కాకుండా నిలుపుదల చేయటంతోనే ఎవరి ఒత్తిడి లేకుండా రాజీనామాలను చేస్తున్నామని వాలంటీర్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

క్రాస్ ఓటింగ్ జరగకుండా నియంత్రించాలి

కార్యకర్తల సమావేశంలో ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కార్యకర్తలు కలసికట్టుగా పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. వయోవృద్ధులు, వికలాంగ ఓటర్లను గుర్తించి వారి ఇంటివద్దే ఓటు వేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించాలని చెప్పారు. ఎక్కడ క్రాస్ ఓటింగ్ జరగకుండా సైకిల్, గ్లాసు గుర్తుపైనే ఓటు పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఖుద్దూస్, హరి ప్రసాద్, జొన్నాదుల మహేష్, హరికృష్ణ, సూరిబాబు, అత్తోట శరత్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తా

బిఎస్‌పి పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి యాతాటి కిషోర్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాయావతి ఆశీస్సులుతో పొన్నూరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా యాతాటి కిషోర్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి పరంజ్యోతి నియమించారు. ఈ మేరకు మంగళవారం పరంజ్యోతి తాజాగా ప్రకటించారు. ఈ సందర్భంగా యాతాటి కిషోర్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యాతాటీ కిషోర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పొన్నూరు నియోజకవర్గంలోని ప్రథమంగా ఆటోనగర్ ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. తమ హామీల్లో ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నామని తెలిపారు. చేబ్రోలు, పెదకాకాని మండలాలలో చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలకు కల్పించటం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో బహుజన సమాజ్ పార్టీకు ఓటు వేసి గెలిపించాలని యాతాటి కిషోర్ కోరారు.

పొన్నూరులో వైసిపి అభ్యర్థి మురళీకృష్ణ ప్రచారం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వైసిపి అభ్యర్థుల విజయానికి శ్రీరామరక్షగా నిలుస్తాయని పొన్నూరు వైసిపి అసెంబ్లి అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పొన్నూరు 1, 2, 3 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. అభిమానులు, వైసిపి కార్యకర్తలు మురళీకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్ఆర్ పథకాలను ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాను గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ పర్యటనలో మైనార్టీ నాయకులు షేక్ నాజర్, మొల్ల కరీం, వైసిపి నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, వట్టిప్రోలు రంగారావు, ఆకుల రామ్మోహన్, షేక్ నాజర్, వడ్రాణం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి-తెనాలి :కాళీ స్థలాల యజమానులు వాటిని ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా నీటి నిల్వలు, చెట్లు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ బి.శేషన్న చెప్పారు. పట్టణంలోని 4వ వార్డు బిసి కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో కాళీ స్థలాల్లో నీరు నిలిచి ఉండటం, చెట్లు, కంప పెరిగి ఉండటాన్ని గమనించారు. నీటి నిల్వలపై పారిశుధ్య కార్మికులతో ఆయిల్ బాల్స్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనావాసాల మద్యనున్న కాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉంటే పాములు, ఇతర జలచరాలు చేరే ప్రమాదం ఉందని, అలాగే దోమల తీవ్రత పెరుగుతుందని, అది చుట్టుపక్కల వారికి ఇబ్బందికరమన్నారు. యజమానులు వారి స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలన్నారు. పల్లపు స్థలాల్లో మెరకలు తోలించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, శానిటరి సెక్రటరీ విజయచందర్ పాల్గొన్నారు.

నిల్వ నీటిపై ఆయిల్ బాల్స్ చల్లిస్తున్న కమిషనర్ బి.శేషన్న

కళ్లం పుల్లారెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శం

సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి రవి

ప్రజాశక్తి-తాడేపల్లి

నివాళులర్పిస్తున్న ఎం రవి తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పనిచేసిన కళ్లం పుల్లారెడ్డి ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. పెనుమాకలో కళ్లం పుల్లారెడ్డి 34వ వర్ధంతి సభ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పుల్లారెడ్డి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నేత షేక్ ఖాదర్ బాబా పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎస్‌కె ఎర్రపీరు అధ్యక్షతన జరిగిన సభలో రవి మాట్లాడుతూ పుల్లారెడ్డి 34 సంవత్సరాల క్రితం మృతిచెందినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి నేటికీ ప్రజల్లో సజీవంగానే మిగిలి ఉందన్నారు. పెనుమాకలో ఏ సమస్య వచ్చినా ప్రజలు పుల్లారెడ్డి వద్దకు వచ్చి ఆ సమస్యను పరిష్కరించుకునే వారన్నారు. పుల్లారెడ్డి ఆశయస్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సిపిఎం కార్యకర్తలు పని చేయాలన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయన్నారు. అడ్డుఅదుపు లేకుండా పెరుగుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పచ్చి నిరంకుశత్వంతో, నియంతలా వ్యవహరిస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. ప్రజా వినాశకర విధానాలు అవలంభిస్తున్న బిజెపిని దానికి తొత్తులుగా మారినవారిని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానాలను కాపాడే ఇండియా వేదిక అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పెను మాక కార్యదర్శి షేక్ గని, సిపిఐ నాయకులు సాంబి రెడ్డి, రైతు సంఘం నాయకులు వీరస్వామి పాల్గొన్నారు.

అవగాహన ఆధ్వర్యంలో వీరేశలింగం జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

కుల, మత, వర్ణ విబేధాలు లేని ఆదర్శ సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం తెలుగు వారందరికీ చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. వీరేశలింగం జయంతి సందర్భంగా స్థానిక అవగాహన కార్యాలయంలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ చరిత్రపుటల్లో చిరస్థానం పొందిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం అన్నారు. వితంతువులకు పునర్వివాహాలు అవశ్యమని ప్రచారం చేసి మూఢాచారాలను, మూఢ నమ్మకాలను సంఘంలోని దురాచారాలను రూపుమాపటానికి ఆయన సేవలు చిర స్మరణీయమన్నారు. సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని సాహిత్య ప్రక్రియల్లో నాటక రంగం అత్యంత శక్తివంతమైందని అన్నారు. నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక, నైతిక సమస్యాన్నీ తెలియజేసింది నాటకమేనని అన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సభ్యులు

హోం బ్యాలెట్‌పై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసేందుకు బిఎల్ఓ లకు మరియు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కి ఎన్నికల సెక్టార్ అధికారి జి శ్రీనివాసరావు మంగళవారం పలు సూచనలు చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో 22 న పాఠశాలలు (పోలింగ్ స్టేషన్ల) తాళాలను బిఎల్ఒలు తీసుకోవాలని అన్నారు. ఇంటి వద్ద నుండి ఓటు వేయడానికి అర్హత కలిగిన వారిని సర్వే ద్వారా గుర్తించడం జరిగిందని, వారు ఓటు హక్కు వినియోగించుకునే అభ్యర్థుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఇంటి నుంచి బయటకు రాలేని స్థితిలో వున్న 85 సంవత్సరాల పైబడిన వృద్ధులు, మంచానికి పరిమితమైన వికలాంగులు ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అని అన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియ గురించి ఓటర్లకు మరియు ఓటరు కుటుంబ సభ్యులకు శలపాడు, శేకూరు గ్రామాలలో వివరించి చెప్పడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో శలపాడు మరియు శేకూరు వీఎం పాలెం బిఎల్వోలు రూట్ ఆఫీసర్ రియాజ్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్ గురించి తెలియజేస్తున్న సిబ్బంది

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి - మంగళగిరి :పాత మంగళగిరి చెందిన సిపిఎం సభ్యుడు షేక్ బాషీద్ భాష (55) సోమవారం రాత్రి చెందారు. భాషకు భార్య, కుమారుడు ఉన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవనహర్, ఎం బాలాజీ, పట్నం నాయకులు పి అన్వర్ ఖాన్, అంజుమన్ సంస్థ అధ్యక్షులు షేక్ అక్రమ్‌లు బాష మృతికి సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఓటు కోసం ప్రజలను బెదిరిస్తే ఎలా?

ప్రజాశక్తి-మంగళగిరి

అధికార పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేయకపోతే బెదిరిస్తున్నారని ఇది సబబు కాదని ఏ ఆర్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మంగళగిరి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జంజనం కోటేశ్వరరావు మంగళవారం సాయంత్రం మంగళగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు ప్రజల డబ్బేనని అన్నారు. వాళ్ల జేబులో డబ్బులు ఇవ్వడంలేదని అన్నారు. ఓటర్లకు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేయలేరని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ టిఆర్ఎస్ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ ఎఆర్ఎస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలు పోటీ చేస్తున్నమని తెలిపారు. మంగళగిరి అసెంబ్లీకి తాను ఈ నెల 18వ తేదీన నామినేషన్ వేస్తున్నట్లుగా తెలిపారు. ఏ ఆర్ ఎస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పదవిని అన్ని పేద బడుగు బలహీన వర్గాల వారికి అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

పిఒ, ఎపిఒలకు శిక్షణా తరగతిలో రిటర్నింగ్ అధికారి లక్ష్మీకుమారి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ఈసీ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి కోరారు. స్థానిక వీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొదటి విడతగా 374 మంది పిఓ, పిఓలకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్‌ల అసెంబ్లింగ్ గురించి ఆమె పలు సూచనలు చేశారు. సమావేశంలో పొన్నూరు, చేబ్రోలు తహసిల్దార్లు సూర్యనారాయణ సింగ్, రమాదేవి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకష్ణ, మున్సిపల్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పీవోలు, ఏపీవోలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో మురుగుడు లావణ్య ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

గత ఐదేళ్ళ జగన్ మోహన్ ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరిస్తూ మంగళవారం వైయస్సార్సీపి మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య పట్నంలోని 24 వార్డులో ప్రచారం నిర్వహించారు. తనకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల, వైఎస్సార్సీపీ నాయకులు మురుగుడు సత్యం తదితరులు పాల్గొన్నారు

బయోటెక్నాలజీలో భూషణంకు డాక్టరేట్

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన కసుకుర్తి భూషణానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'కంటి రెటీనా, ఎలుకల లోని ఆప్టిక్ నరాలతో స్థానిక, దైహిక కణజాలాలపై విద్యుదయస్కాంత వికిరిణ ప్రభావం' అంశంపై ఆయన పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు ఆయన మంగళవారం తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుధాకర్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. పరిశోధనలో భాగంగా భూషణం మెంట్రియల్ మెడికల్ స్కూల్ కెనడా, పంజాబ్ యూనివర్సిటీ చండీఘడ్, ఎయిమ్స్ న్యూ ఢిల్లీ వారి ప్రత్యేక సాంకేతిక విభాగాల సహాయంతో జాతీయ సెమినార్ల ద్వారా కూడా తన పరిశోధనా అంశంపై వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ నుంచి 2011లో బయోటెక్నాలజీలో ఆయన పీజీ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనను పలువురు పట్టణ ప్రముఖులు, బంధుమిత్రులు అభినందించారు.

జిఎంసి ప్రధాన కార్యాలయంలో

18 నుండి నామినేషన్లు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి ఈనెల 18 నుండి నామినేషన్‌లను స్వీకరణకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో తగిన ఏర్పాట్లు చేశామని నగర కమిషనర్ అండ్ తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి కమిషనర్ చాంబర్‌లో, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సిటీప్లానర్ చాంబర్‌లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు తీసుకుంటారని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థులకు కమిషనర్ చాంబర్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో నామినేషన్ ఫారాలు అందించడం, ఫారాలు నింపే అంశాలు తెలియ చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్లను ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు ఈనెల 18 నుండి 25 వరకు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకోవడం జరుగుతుందని, సెలవు రోజుల్లో నామినేషన్లు తీసుకోబోమని తెలిపారు. నామినేషన్ ఫారాలు తీసుకునే సమయంలోనే ప్రతి ఒక్కరికీ చెక్‌లిస్టు ఇస్తున్నామని, అందుకు తగిన విధంగా నామినేషన్ ఫారాలు పూర్తిచేసి ఇవ్వడం ద్వారా నామినేషన్లు రిజెక్ట్ కాకుండా ఉంటాయని తెలిపారు. 25వ తేదీ వరకూ అందిన నామినేషన్లను ఎన్నికల కమిషన్ నిర్దేశిత షెడ్యూల్ మేరకు 26వ తేదీ పరిశీలన చేస్తామని, 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

సెలవు రోజూ జిఎంసి క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబందించిన ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై లభించే 5 శాతం రాయితీకి 2 వారాలే గడువు ఉన్నందున, పన్ను చెల్లింపుదారులకు వీలుగా నగరపాలక సంస్థ క్యాష్‌కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా పని చేసేలా చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, రాయితీకి కేవలం 2 వారాలే గడవు ఉందని తెలిపారు. రాయితీని పన్ను చెల్లింపుదారులు అధిక సంఖ్యలో సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పన్ను చెల్లింపు కోసం జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు పని చేసేలా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డ్ సచివాలయాల్లో అదనపు క్యాష్ కౌంటర్లను కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఈనెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ కీర్తి చేకూరి కోరారు.

బెస్ట్ చాప్టర్ అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

తెనాలి ఏఎస్ఎన్ ఫార్మా విద్యార్థులకు

ఐపిఎఎస్ఎఫ్ బెస్ట్ చాప్టర్ అవార్డు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఐపిఎఎస్ఎఫ్ బెస్ట్ చాప్టర్ పురస్కారం లభించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 12 నుంచి 14 వరకు హర్యానాలోని పానిపట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 'ఎంపవరింగ్ ఫ్యూచర్ పెర్‌ఫార్మెన్స్ ఫర్ నేవిగేటింగ్ హెల్త్ కేర్ టెక్నాలజీ' అంశంపై 13వ జాతీయ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ కాంగ్రెస్ నిర్వహించారు. ముంబైకి చెందిన ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం, పానిపట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన 46 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. పేపర్ ప్రెజెంటేషన్‌తో పాటు కల్చరల్ ఈవెంట్స్, ఇతర అంశాల్లో సత్తా చాటారు. ఈ నేపథ్యంలో ఏఎస్ఎన్ కళాశాలకు ఐపిఎఎస్ఎఫ్ బెస్ట్ చాప్టర్ పురస్కారాన్ని నేషనల్ ఐపిఏ అధ్యక్షులు టివి నారాయణ, ఎడ్యుకేషన్ డివిజన్ అద్యక్షులు ఎస్,విధ్యాదర, అడిషనల్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎం.రాకిషన్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రమణ, ఐపిఎఎస్ఎఫ్ మెంటర్ ఫణికృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్, అధ్యాపకులు అభినందించారు.

అభ్యర్థులు క్రిమినల్ కేసులపై ప్రకటనలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కమిషనర్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల్లో ఎవరిపైన అయినా క్రిమినల్ కేసులు నమోదు అయి ఉంటే వారు తగిన వివరాలతో న్యూస్ పేపర్, టెలివిజన్‌లలో 3 దఫాలుగా ప్రకటనలు ఇవ్వాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల్లో ఎవరిపైన అయినా క్రిమినల్ కేసులు నమోదు అయి ఉంటే వారు తగిన వివరాలతో న్యూస్ పేపర్, టెలివిజన్‌లలో 3 దఫాలుగా ప్రకటనలు ఇవ్వాలని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్ ఓకే అయిన తర్వాత ఉపసంహరణ గడువు ముగింపు అనంతరం పేపర్, టివిల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్‌కి ఒక్కరోజు ముందు అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని తెలిపారు. నామినేషన్ ఫారాలతో పాటుగానే నిర్దేశిత డాక్యుమెంట్స్ జత చేయాలని, నామినేషన్ ఫారాలను పూర్తి చేసేప్పుడు ఏ సందేహాలు ఉన్నా జిఎంసిలోని హెల్ప్ డెస్కులను సంప్రదించవచ్చన్నారు. నామినేషన్లు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారీ కార్యాలయంలో తీసుకోవడం జరుగుతుందన్నారు. నామినేషన్ దాఖలుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని, నామినేషన్ వేసిన రోజు నుండే అభ్యర్థి ఖర్చులు లెక్క వేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఆర్ఓ సునీల్, ఏఈఆర్ఓ ప్రదీప్‌కుమార్, ఎన్నికల విభాగ సూపరింటెంట్ పద్మ, కె.దివాకర్ రెడ్డి, డి.జానిబాబు (వైఎస్సార్సీపి), సిహెచ్.వాసు (బిఎస్పి), డి.బాలస్వామి , (కాంగ్రెస్) ఖాసిం షాహిద్ (సిపిఎం) పాల్గొన్నారు.

విఐటి - న్యూరాలిక్స్ మధ్య అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమ రావతి లోని విఐటి విశ్వవిద్యాలయం, ఎ1 స్టార్టప్ న్యూరాలిక్స్ మధ్య కృత్రిమ మేధస్సు, పరిజ్ఞానం పరిశోధనను అభివృద్ధి చేయడానికి అవగాహన ఒప్పందాన్ని కుదుర్చు కున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ రంగంలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అధ్యాపకుల కోసం సహకార పరిశోధన, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ కార్యకలాపాలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా న్యూరాలిక్స్ సిఈఓ వ్యవస్థాపకుడు డాక్టర్ జయరామ్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ అవగాహనా ఒప్పందం సాంకేతికతకు సంబంధించినది మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలను ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా పరిష్కారాలను వెతికే జ్ఞానాన్ని అందించడం అని తెలియజేశారు. విఐటి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోటా రెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమ-అకాడమి సహకారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌లో ప్రాక్టికల్ లెర్నింగ్ అవకాశాలను అందించడానికి న్యూరాలిక్స్‌తో భాగస్వామిగా ఉన్నందుకు సంతోషిస్తున్నామని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ ముదిగంటి మాట్లాడుతూ ఈ సహకారం ద్వారా రానున్న కాలంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ రంగంలో విద్యార్థులు అగ్రగాములుగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ అవగాహనా ఒప్పంద కార్యక్రమంలో డాక్టర్ అమీత్ చవాన్ (డైరెక్టర్,ఐ ఐ ఈ సి) డాక్టర్ హరి సీత (ఎఐఅండ్ఆర్ డైరెక్టర్), డాక్టర్ ప్రదీప్ రెడ్డి (డీన్ స్కోప్, డాక్టర్ సిబి చక్రవర్తి ఎస్ పాల్గొన్నారు.

ఎపి గురుకులాల్లో ప్రవేశాలకు 25న పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీన 5, 6, 7, 8వ తరగతులకు ఎపిఆర్ఎస్ క్యాట్ పరీక్ష ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కళాశాలల్లో ప్రవేశాలకు ఎపిఆర్‌జెసి అండ్ డిసి సెట్ అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షకు సంబంధించి అభ్యర్థుల హాల్ టిక్కెట్లు ఎపిఆర్ఎస్.ఎపిసిఎఫ్ఎస్-ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో నుండి ఈనెల 17వ తేదీ నుండి అభ్యర్థులు క్యాండిడేట్ ఐడి, పుట్టిన తేదీ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

పాతగుంటూరులో ఇండియా బ్లాక్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియా బ్లాక్ పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్.మస్తాన్‌వలి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పాతగుంటూరులోని 4, 8, 9, 10 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపియం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కె.మాల్యాద్రి, సిపిఐ నాయకులు మేడా హనుమంతరావు, సుబాని, ఎ.అరుణ్‌కుమార్, సిపియం నాయకులు కార్తీక్, టి.శ్రీనివాస్, షేక్.సైదా, కె.శ్రీనివాసరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రజిని తీసుకున్న సొమ్ము ఇవ్వలేదు

టిడిపి నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిలకలూరిపేట వైసిపి టిక్కెట్ ఇప్పిస్తానని మంత్రి విడుదల రజిని తన వద్ద తీసుకున్న సొమ్ము ఇంత వరకు తిరిగి తనకు అందలేదని అందువల్లే తాను వైసిపి నుంచి బయటకు వచ్చి టిడిపిలో చేరానని పశ్చిమ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు మల్లెల రాజేష్ నాయుడు ప్రకటించారు. పశ్చిమ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి గల్లా మాధవితో కలిసి మంగళవారం శ్రీనివాస రావుపేట టిడిపి ఎన్నికల కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపిలో తనకు అన్యాయం జరగటం వలనే పార్టీ మరాల్సివచ్చిందన్నారు. 2019లో తాను చిలకలూరిపేటలో వైసిపి గెలుపునకు కృషి చేశానన్నారు. చిలకలూరిపేట జగనన్న కాలనిలో భూముల కొనుగోలు విషయంలో కోట్లాది రూపాయల దుర్వినియోగం అయ్యాయని అన్నారు. 227 ఎకరాల గ్రానైట్ జగన్ మోహన్ రెడ్డి అనుచరులకు రజిని ఇప్పించిన మాటా వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సొంత ఇళ్ళు కట్టుకోవడం కోసం ప్రభుత్వ అధికారులను పిలిచి డబ్బులు వసూలు చేశారన్నారు. చిలకలూరిపేటలో మద్యం దుకాణాలు నడిపిన ఏకైక మంత్రిగా, ఎమ్మెల్యే గా విడుదల రజిని చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చిలకలూరిపేటలో బిసి భవన్, కాపు భవన్ పేరుచెప్పి ఇంతవరకు వాటి పనులు ఏవీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయనిపరిస్థితి నెలకొంద న్నారు. సమావేశంలో జనసేన అధికారి ప్రతినిధి ఆళ్ల హరి, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామాయ్య తదితరులు పాల్గొన్నారు.